# ఆసరా



**చాగంటి తులసి**

"**మ**ళ్లీ బదిలీనా ?"

"మరే !"

"ఇది ఎవరో కావాలని చేసినట్టుగా ఉంది."

"కావాలని చేసారో ఎలా చేసారో ! ఏదైనా ఒకటే ! ఎక్కడైతేనేం? దేశం అంతా మనది కాదా ఏం ?"

"దేశం అంతా మనదే ! ఎవరు కాదన్నారు? మళ్లీ నువ్వక్కడా! నేనిక్కడా !"

"మంచిదే కదా ! ఒకరి మీద ఒకరం ఆధారపడ్డం అలవాటుగా మారదు !"

"నీదంతా అదోరకపు ఆలోచనా ! మనం ఒకరి మీద ఒకరు ఆధారపడితే తప్పేంటిటా ? మరీ విడ్డూరపు మాట గాని !"

"కలిసి పని చేసుకోవడం ఒకరికొకరు సాయం పడ్డం వేరు. ఒకరి మీద ఆధారపడ్డం వేరు ! పని చెయ్యడమూ అలవాటే ! చేయించుకోవడమూ అలవాటే ! ఆ అలవాట్లు వేళ్లు తన్నకుండా ఉండాలంటే కొన్నాళ్లపాటు దూరంగా ఎడంగా ఉండడం అవసరమే!"

"నీకేం ! నువ్వు కొత్త ఊరు వెళ్తున్నావ్! నీకు బాగానే ఉంటుంది! కొత్త పరిచయాలు, కొత్త వాతావరణం ! నాకే రొటీను బతుకూ నువ్వు లేని వెలితీను !!

" నువ్వే మధ్య మధ్య సెలవు పెట్టుకుని రా !! నా కొత్త ఊరునీ కొత్త పరిచయాల్నీ, నా కొత్త అనుభవాల్నీ నాతో పంచుకోవచ్చు!"

"అదీ నిజమే! నువ్విక్కడికి వస్తే ఏముందీ? పాత చింతకాయ పచ్చడి!"

"అందరూ బదిలీ అంటే బాధ పడ్తా రెందుకో? నాకు అర్థం అయిచావదు ! ఒకచోటే పాతుకుపోయి చూసిన మొహాల్నే చూస్తూ, తిరిగిన రోడ్లంటే తిరుగుతూ, ఏడ్చిన ఏడుపుల్నే ఏడుస్తూ !!......

"సరి సర్లే; నువ్వు వెళ్లే ఆ కొత్త చోటు మాత్రం మహా ఎంతకాలం కొత్తగా ఉంటుందిట? అందులో నువ్వు ఇట్టే అల్లుకుపోయే రకానివి!"

నిజమే ! తను అన్నమాట! నేనే అల్లుకుపోతానో ! నా చుట్టూ ఉన్న వాళ్లే నన్ను చుట్టుకుపోతారో !

ఆ ఊరు వెళ్ళి ఉద్యోగంలో చేరానో లేదో ఇట్టే అందరికందరూ ఎప్పట్నించో ఎరిగున్న వాళ్లూ నాక్కావలసిన వాళ్లు అయిపోయి కూచున్నారు !"

అందులో ఆవిడ! ఆవిడ నన్ను అంటుకుని అతుక్కుపోయింది! నా మనస్సునీ, ఆలోచనని ఆక్రమించేసింది!

"ఏయ్ ! నీ మనస్సుని ఆక్రమించేసింది ఎవరో 'ఆవిడే'నా ? ఎవరో 'ఆయన' కాదుకద! మనకొంప కూలడానికి" అంటూ ఎకసెక్కాలు ఆడ్డం మొదలెట్టాడు.

ఆ ఊరు వెళ్లిన కొత్తల్లోనే మహిళా సంఘం వాళ్లు ఏదో సభ ఏర్పాటు చేసారు. నన్నూ ఓ వక్తగా పిలిచారు. ఆవిణ్ణీ పిలిచారు. నేను ఆ ఊరికి కొత్తగా వచ్చిన దాన్ని! ఆవిడ ఆ ఊరికి కొత్తగా ఎన్నికైన ప్రథమ మహిళ. ఇద్దరమూ చెరో విధంగా కొత్తవాళ్లమే !

కొత్తా పాతా లేకుండా ఎవరితో నన్నా గలగలా మాట్లాడ్డం నా స్వభావం. ఆవిడ బిడియపడుతూ అతి కష్టంమీద రెండు మాటలు మాట్లాడింది. అదీ నేను అడిగిన దానికి సమాధానంగా ! నాతో మాట్లాడినప్పుడే ఆవిడ బిడియపడలేదు. వేదిక మీద నుంచి మాట్లాడిన ఆ నాలుగు మాటలు కూడా ఎంతో బిడియ పడుతూ మాట్లాడింది. అది బిడియం కాదు. బెదురూ బెరుకు అని తర్వాత బోధపడ్డాది.

ఆవిడ అందమైనది. గుండ్రటి మొహం. మెత్తటి బూరి బుగ్గలు కొన తేలిన గెడ్డం. మొహంలో ఉన్నది కళ్లే అన్నట్టు కొట్టొచ్చినట్టు కనపడే పెద్ద పెద్ద కళ్లు. ఆ గుండ్ర మొహానికి సరిపడ్డట్టూ ఎంతో గుండ్రంగా పెట్టుకున్న ఎర్రటి కుంకం బొట్టు. రెండు చేతులకీ గలగల లాడుతూ ముంజేతి నుంచి మోచేతి వరకూ రంగురంగుల గాజు గాజులు. కట్టుకున్న చీర రంగుకి సరిపడా రంగు ఉన్న జాకెట్టునీ, మెళ్లో వేసుకున్న నగల్ని కనిపించకుండా నిండా కప్పుకున్న పమిటచెంగు. ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించే విగ్రహం !

ఆవిడ నన్ను తనవేపు లాక్కుని ఆకట్టుకుందో నేను ఆవిణ్ణి నావేపు లాక్కుని ఆకట్టుకున్నానో గాని ఆవిడ నాకు చేరువ అయింది. నాలో ఆవిడ ఏం చూసిందో ఏం ఇష్టపడిందో ఏమో బిడియ పడ్తూనే నాకు అన్నీ చెప్పుకోవడం మొదలుపెట్టింది.

"ఏండీ!" అంటూ ఆవిడ ఓ రోజు నా ఇంటికి వచ్చింది. ఆవిడ 'ఏమండీ' అని అనదు. 'మ' ని మింగేసి "ఏండీ!" అనే పిలుస్తుంది.

"ఈ ఏపు పని పడి వొచ్చేను. ఆయాళ ఈ ఈదిలో ఉంటున్నానని సెప్పేరు కదాండి! పలకరించి పోదామని వొచ్చేను!" అన్నాది.

"రండి, రండి" అంటూ ఆప్యాయంగా చూస్తూ ఆవిణ్ణి లోపలికి ఆహ్వానించాను. అదిగో ఆరోజు మొదలు నాతో అవీ ఇవీ తన సంగతులు చెప్పుకోవడం ఆరంభించింది.

"ఇలా పెద్దమనిషి నయ్యానో లేదో అలా మనువు అయిపోయిందండి. నేనేం చదువు కోలేదు. కొంపలో పడి ఉండడమే. ఎప్పుడూ బయటికి కూడా రాలేదండి. అస్సలు నిజానికి ఈయనే నిలుసోవలిసిందండి. అయితేఆడవాళ్ల రిజర్వుగా, నేనున్నాను, మన పార్టీ వాళ్లున్నారు, నువ్వు ముందు ఉంటావు. వెనకనుంచి అంతా మేం చూసుకుంటాం అన్నారండి. అందరి మద్దత్తూ ఈయనకేనండి. ఏకంగా నన్ను పెద్ద కుర్సీలో కూకుండ పెట్టీశారు! ఇహ తప్పదు కదండి. మీటింగులు ఎట్టాలండి. మీటింగులకి ఎల్లాలండి. మాట్లాడా లండి. తప్పదు కదండి. నేరుసుకుంటున్నా నండి ఏంటో ! మిమ్మల్ని సూసిన ఏలా ఇసేసం మనసులో మాట మీతో చెప్పుకోవాలని పిస్తుందండి."

నాతో మాట్లాడుతున్నప్పుడు ఆవిడ భాషా, మాట తీరూ ఆవిడకి సహజమైనది ఆవిడకి తెలీకుండానే వచ్చేస్తూ ఉంటుంది - మధ్య మధ్యలో ప్రయత్న పూర్వకంగా ఆ మాట తీరునీ భాషనీ మాటల వాడుకని మానుకుంటూ చెప్పడానికి తంటాలు పడుతూ చెప్పుకుంది.

ఆవిడ నేర్చుకుంటున్నానని చెప్పింది. నాకు ఎంతో సంతోషం అనిపించింది దేశం మారుతోంది. మహిళలు ముందుకి వస్తున్నారు. ఆలోచనా వివేచన ఉన్న మహిళల శాతం పెరుగుతూ ఆ మహిళలకి తోడ్పాటు నిచ్చే సహృదయులైన పురుషుల శాతం కూడా పెరుగుతోందా ? ఈ విషయం దగ్గరే నాకూ తనకీ తగాదా వస్తూ ఉంటుంది. ఇద్దరమూ వాదించుకుంటూ ఉంటాం. "చట్రం మారందే మీరు మారరు మహాశయా!" అని ఎప్పుడూ నేను ఎత్తిపొడుస్తూనే ఉంటాను. నా ఎత్తి పొడుపులని తను తప్పుగా తీసుకోడు. ఆ మహాశయుడు తను కాదు కద !! "చట్రం అంతా మారేలోగా నాలాంటి 'ద్వీపాల దీపాలు' ఏర్పడితేనే మీకు బలం చేకూరుతుంది!! తెలుసా వివేకవతీ?" అని తనూ వెక్కిరిస్తూ మాటకి మాట అంటాడు. తను చట్రపు సముద్రంలో ఏర్పడ్డ ద్వీపం అని, వెలుగుని ప్రసరిస్తున్న దీపం అని గొప్ప చెప్పుకుంటాడు.

'ఆవిడ' లాంటి వాళ్లు దేశంలో కొత్తగా పుట్టుకు వస్తున్నారు. మంచిదే కద! మంచికే కద! అన్నాడు.

"ఏమో ! మంచో చెడో ఎలా చెప్తాం?" అంటూ సందేహపు మొహం పెట్టేను.

"మీరు ఎడుగుతున్నా "మీకు" పెరకువ వస్తున్నా నీకు సందేహమే! మా బాగుంది!!"

"చట్రం అలాంటిది మహానుభావా!" అని నేను ఆలోచనలో పడ్డాను.

చూస్తూ చూస్తూ ఉండగానే ఆవిడలో మార్పు వచ్చింది. స్కూళ్లు కాలేజీల డిగ్రీ చదువులు ఎందుకూ? జనం మధ్య కలిగే జ్ఞానం తెలివిడీ ఆ చదువులు కన్నా నిస్సం దేహంగా గొప్పదే!!

ఆవిడ కట్టూ బొట్టూ మారిపోయింది ! మాట తీరు మారిపోయింది. ఇదివరకు జుట్టు ముడి వేసుకునేదా అలాంటిది పొట్టిగా జుట్టు కత్తిరించుకుని ఓ నల్ల రబ్బరు బేండుతో అది బాబ్డ్ హెయిర్ స్టయిలేమో అని అనిపించేటట్టు కనపడుతోంది. పమిట కప్పుకోవడం మానే సింది. పమిట కొంగు పొడుగ్గా వేసు కోవడమే కాదు జరీ అంచు కనిపించేటట్టు ప్లేట్లుగా పిన్నీసు పెట్టుకుని రెండు చేతులూ ఊపుకుంటూ చకచకా నడుస్తోంది. గుండ్రటి ఎర్ర కుంకం బొట్టు కాస్తా కనుబొమల మధ్య దోసగింజ స్టిక్కరు అయి చీరరంగుతో సరిపోయేది వచ్చింది. ముంజేతి నుండి మోచేతి వరకూ ఉండే గాజు గాజుల స్థానంలో కెంపులతోనో, పచ్చలతోనో బంగారు గాజులు ఓ చేతికి, రెండో చేతికి మెరిసిపోతున్న వజ్రాలు పొదిగిన వాచీ! మెళ్లో పమిట మీంచీ పొడుగ్గా వేళ్లాడుతూ నీలాల పెండెంటుతో బంగారు గొలుసు! దాని మీదకి కాస్త పొట్టిగా నల్లపూసల దండా, నల్లరాళ్ల పెండెంటు !

"గ్రూమింగండీ బాబూ! గ్రూమింగా మరోటా ? ఇప్పుడు ఉపన్యాసాలు బాగానే ఇస్తోంది! మంచి భాషే మాట్లాడుతోంది!" ఒకసారి నాతో ఎవరో అన్నారు!

"మొదట్లో మొదట్లో చాలా కష్టంగా అనిపించింది కానండీ తర్వాత కిటుకు లాంటిది తెలిసిపోయింది. ఏముందండి? వేదిక మీద ఉన్న వాళ్లందరికీ వాళ్ల వాళ్ల ఉద్యోగాల వివరాలకి బోలెడన్ని విశేషణాలు విశేషాలు జోడించి కోటి నమస్కారాలు, వేదిక ఎదురుగా ఉన్న జనానికి శతకోటినమస్కారాలు. చెప్పాలి. ప్రతి వాక్యం చివర విన్నవించుకుంటున్నాను, మనవి చేసుకుంటున్నాను. వాగ్దానం చేసు కుంటున్నాను. మీ ప్రేమాభిమానాలు ఉంటే

చాలు ఎంత శ్రమకైనా వెనకాడననీ మీ కోసం ఏదన్నా చేస్తాననీ మరీ మరీ చెప్పడం ధన్య వాదాలు, కృతజ్ఞతలు, అభినందనలు జోడిస్తూ ఉండడం !"

కాస్త తెలుగు మీరేక ఆవిడ నా దగ్గరికి వచ్చినప్పుడు జనం ముందు ఇచ్చే ఉపన్యాసం అంటే ఏమిటో ఎంత తేలికో మంత్ర రహస్యం చెప్పినట్టు చెప్పింది ! నేను తన సెకెండ్ సెల్ఫ్ అనుకుంటోంది! అన్నీ చెప్పుకుంటోంది! విస్తు పోయాను! ఆవిడ చెప్తున్నవి వినడమే కాని అవునూ కాదు అని నేను ఎప్పుడూ ఏమీ అనలేదు.

మరింత గడుసు మీరేక వచ్చే ఫండ్స్, ఖర్చు పెట్టే విధానాలు, మిగుల్చుకునే మార్గాలు, తనవాళ్లు అనుకునేవాళ్లకు తను చేస్తున్న ఉపకారాలు, గ్రూపు బలం ఉంటే ఎంతైనా ఎంతలా తను లాభపడొచ్చో, ఆ గ్రూపుల్లో వాళ్లకి లాభం కలిగించవచ్చో, ఎవరూ తోసి రాజన కుండా తనను తాను కాపాడుకొనే మెలకువలు ఏమిటో, ఇవన్నీ తన భర్తా, భర్త మిత్రుల సహకారంతో తను ఎలా నేర్చుకుంటూ ముందడుగు వేస్తున్నాదో ఆవిడ కల్లా కపటం లేకుండా నా ముందు అంతా బట్ట విప్పి మరీ చూపించే సరికి నాకు మతిపోయింది !

"జనం ఏముందండి! దాని నోరు ముయ్యడమూ తేలికే ! వీడి నోరు ముయ్యాలంటే వాడి చేతిసొమ్ము వదలగొడ్తాం! వాడి నోరు ముయ్యా లంటే వీడి చేతిసొమ్ము వదలగొడ్తాం! ఆట ఆడ్డం రావాలి. అంతే ! ఒకటండి. ఎప్పుడూ ఎక్కడా ఏ కాయితం మీదా దొరక కూడదు. ఎన్ని నోళ్లు ఎన్ని కారుకూతలు కూసినా కాయితం మీద దొరక్కపోతే అన్నీ గాలికే ! కాగితం మీద అక్షరాల పవరు అలాంటిది! అంతే కాదండోయ్! నోటి మాటకి అంతకన్నా పవరు ఉంది. ఈ రోజుల్లో టెక్నాలజీ పెరగడంతో పై వాళ్ల దృష్టిలో పాడు పనుల మాటలనీ చేతలని పట్టేసుకోవడం మహా తేలికైపోయింది. అంచేత నోరు జారకూడదు. మన చేతులు, చేతలు ఎక్కడా కనిపించకూడదు. వినిపించకూడదు ! అదృశ్యులుగా ఉండడం నేర్చుకోవాలి. అందరినీ కలుపుకుని పోవాలి. మడి కట్టుకోకూడదు. ఇంకొకరికి మనం ఎప్పుడూ అస్పృశ్యులం కాకూడదు !"

ఆవిడ మాటలు విని దిమ్మరపోయాను!

"నాలో ఏదో ఉంది. అదేమిటో నాకు తెలీదు కాని అందరూ నా దగ్గరికి వచ్చి వాళ్ల సంగతులు నాకు చెప్పుకుంటూ ఉంటారు. వాళ్ల వాళ్లతో చెప్పుకోలేనివి కూడా నాకు చెప్తుతూ ఉంటారు. బాధలూ చెప్తారు బాగులూ చెప్తారు" అంటూ నా గొప్ప నేను చెప్పుకుంటూ ఉంటే తను నవ్వేడు!

"నీలో ఏమిటుందో చెప్పమంటావా? నువ్వు మంచి శ్రోతవి ! వాళ్లు చెప్పిందాన్ని వింటావే తప్ప ఖండించవు. తప్పూ అనవు. ఒప్పూ చెప్పవు. ఓసారి ఖండించి తప్పు ఒప్పులు చెప్పి చూడు. అప్పుడు తెలుస్తుంది! నీదగ్గరికి ఎంతమంది వస్తారో!!" అన్నాడు.

తను అన్నది నిజమే! ఎవరు ఏం చెప్పినా శ్రద్ధగా వింటాను. అవునూ కాదు అని అనను. కాబట్టి వాళ్ల మాటలని నేను అంగీకరిస్తున్నానని వాళ్లు అనుకుంటారు కాబోలు ! వాళ్లని ఆ భ్రమలో పడేస్తున్నది నేనేనన్నమాట !!

ఆవిడ విషయంలోనూ నేను అలాగే ఉన్నాను! నాదే తప్పు! ఆవిడ ఇలా తయారవు తున్న సమయంలో ఆ తయారీలో నేనూ వేలు పెట్టాల్సిందేమో! అప్పుడు నా మనస్సుకి ఇంత దెబ్బ తగిలేది కాదేమో!

ఆవిడ ఆలోచనా విధానానికి వ్యతిరేకపు ఆలోచనలని కలిగించకుండా తప్పే చేసేను. 'చట్రం చట్రం' అంటూ మాట్లాడే నేను ఆ చట్రంలోంచి ఆవిణ్ణి తప్పించడానికి కనీస ప్రయత్నం అన్నా చెయ్యలేదు!

ఆవేళ నా మీద ఎంతో ప్రేమతో ఆవిడ చెప్పిన మాట నాకు తూటాలా తగిలింది.

"మీరంటే నాకు ఎంత అభిమానమో మీకు తెలీదు. ఇంతమంది ఇన్ని రకాలుగా నా దగ్గరికి వచ్చి ఏదో ఒకటి అడుగుతూ ఉంటారు. మీరు ఎప్పుడూ ఏదీ నోరు తెరిచి అడగలేదు. ఇప్పుడు అవకాశం వచ్చింది. మీరు అడక్క పోయినా నా అంతట నేనే చెయ్యదలుచు కున్నాను."

ఆవిడ చెప్తున్నదేమిటో తెలీక నోరు వెళ్లబెట్టేను.

"మీకు తోటన్నా కొండగెడ్డన్నా మహా ఇష్టం. అవునా?? మీ ఆయన మీ దగ్గరికి వచ్చినప్పుడల్లా మీరిద్దరూ ఆ కొండగెడ్డ వేపు షికారు వెళ్తూ ఉంటారు. అవునా?? ఆ తోట ఇహమీదే అని చెప్పడానికి వచ్చేను." అన్నాది.

నానోట మాట రాలేదు.

మనకి అలాదఖలు పడ్డాది. మీరు ఒక్కపైసా ఇవ్వక్కర్లేదు. కాగితాల మీద రాతలు సరే అవి పద్ధతి ప్రకారం ఉంటాయిలెండి!"

"మాకెందుకెండీ తోట?" అన్నాను మాది ఈ ఊరు కాదు. మాకెందుకండీ తోటలు దొడ్లూ?" మర్యాదగా పైకి అలా ఆవిడకి చెప్పేనే కాని ఈవిడ మనసులో నా గురించి ఏమను కుంటోంది! ఉల్పాగా వచ్చే వాటికోసం చేతులు చాచిపెట్టి ఉన్నానను కుంటోందా? ఆవిడ చెప్పేవన్నీ ఇన్నాళ్లూ తల ఊపుతూ అందుకే వింటున్నాననుకుంటోందా? ఆవిణ్ణి నేను చట్రంలోంచి తప్పించడం మాట దేవుడెరుగు! నన్ను ఆ చట్రంలోకి లాగి అందులో ఓ కీలని చేసే స్థితికి ఆవిడ ఎదిగిపోయింది!! అని నన్ను నేను తిట్టుకున్నాను.

ఆవిడ వల్ల మాకొంప కూలదు కాని ఆవిడలాంటి వాళ్ల వల్ల దేశం కుప్ప కూలి పోవడం ఖాయం!!


**పుస్తకావిష్కరణ వేదిక**

**విజయవాడలో పుస్తకావిష్కరణ అభిలషించే రచయితలకు ఆహ్వానం**

'చినుకు-శ్రీ వాగ్దేవి' సంయుక్తంగా ప్రగతిశీలసాహిత్యగ్రంథాల ఆవిష్కరణోత్సవానికి సహకారాన్ని అందిస్తున్నాయని తెలియచేస్తున్నాం. ఉత్సాహం ఉన్న రచయితలు చినుకు సంపాదకవర్గాన్ని సంప్రదించండి